

రూ. లక్ష విరాళం

శ్రీశైలంటెంపుల్: నిత్యాన్నదాన పథకానికి గురువారం కాకినాడకు చెందిన సత్యనారాయణ రూ.లక్ష విరాళంగా అందజేశారు. దాతకు ఆలయ అధికారులు విరాళాల బాండ్ అందజేశారు.



అన్నదాతకు అధిక సం'పత్తి'

అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసే విధంగా వ్యవసాయాధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ విధానంలో దిగుబడి పెరగడమే కాకుండా అధిక ఆదాయం లభించనుంది.

8లో

ఉష్ణోగ్రతలు

కనిష్టం	21.3
గరిష్టం	34.4

న్యూస్‌రీల్

నేడు పోస్టల్ బ్యాలెట్

కర్నూలు(అర్బన్): గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో ఉన్న ఉద్యోగులు ఈ నెల 10వ తేదీన పోస్టల్ బ్యాలెట్‌ను ఉపయోగించుకునేందుకు అవకాశం కల్పించినట్లు నోడల్ అధికారి టీ నాగరాజునాయుడు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులు కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన సౌలభ్య కేంద్రాన్ని ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉపయోగించుకోవచ్చని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఫారం -12 లో దరఖాస్తు చేసుకొని, ఎన్నికల విధుల్లో ఉన్న అర్హత కలిగిన ఉద్యోగులకు సౌలభ్య కేంద్రంలోనే పోస్టల్ బ్యాలెట్ అందజేస్తామని, అక్కడే వారు ఓటు హక్కును వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

జంబో బ్యాలెట్ బాక్సులు సిద్ధం



జంబో బ్యాలెట్ బాక్సులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): ఎమ్మెల్సీ ఎన్నికలకు జంబో బ్యాలెట్ బాక్సులను అధికారులు సిద్ధం చేశారు. గురువారం జెడ్పీలోని కర్నూలు ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వీటిని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి పరిశీలించారు. అనంతరం సిబ్బంది చేత వీటిని శుభ్రం చేయించారు. ఆదోని, పత్తికొండ నియోజకవర్గాలకు 80 జంబో బ్యాలెట్ బాక్సులను పంపించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో రెండు చొప్పున వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఎస్‌ఈ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌కుమార్, ఏపీఓ మహమ్మద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ కార్యాలయాలకు పోలింగ్ మెటీరియల్

కర్నూలు(సెంట్రల్): పోలింగ్ మెటీరియల్ గురువారం సాయంత్రం ఆర్డీఓ కార్యాలయాలకు చేరింది. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పోలింగ్ మెటీరియల్ కిట్‌లను కలెక్టర్ కోటేశ్వరరావు, జేసీ రామసుందర్‌రెడ్డి పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కిట్‌లో ప్లాస్టిక్ పేపర్ స్కేల్, ఇంక్ ప్యాడ్, తిన్ వైర్లు, కార్బన్ పేపర్, పెన్సిల్, కార్డ్ బోర్డు, క్యాండిల్, మ్యాచ్‌బాక్సు, బాల్ పిన్లు, జెమ్‌క్లిప్స్, గమ్ అండ్ పేస్టు, నిడిల్, బిగ్‌క్యారీ బ్యాగులు ఉన్నాయి.

ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(సెంట్రల్): ఎమ్మెల్సీ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని రూట్, జోనల్ ఆఫీసర్లకు జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి సూచించారు. మొదటి విడత శిక్షణకు గైర్హాజరైన పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్చి 13వ తేదీన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మాస్టర్ ట్రైనర్స్ రాముడు, లోకేశ్వర్, సలీంబాషా పాల్గొన్నారు.

ఖర్చుల వివరాలు తెలపండి

కర్నూలు(సెంట్రల్): పశ్చిమ రాయలసీమ పట్టభద్ర, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ బరిలో ఉన్న అభ్యర్థులు చేస్తున్న ఖర్చుల వివరాలను పంపాలని ఆ సెల్ ఇన్‌చార్జి అధికారి రామాంజనేయులు గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఇంతవరకు అభ్యర్థులు ఎవరూ చేసిన ఖర్చుల వివరాలను పంపలేదని, ప్రతి రెండు రోజులకు ఒకసారి పంపాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్ వేసిన తేదీ నుంచి ఇప్పటి వరకు చేసిన ఖర్చుల వివరాలను తెలపకపోతే ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

శ్రీశైలంలో 23 వరకు అభిషేకాలు నిలుపుదల

శ్రీశైలంటెంపుల్: ఉగాది మహోత్సవాలను పురస్కరించుకుని గురువారం నుంచి ఈ నెల 23వ తేదీ వరకు స్వామివారి గర్భాలయ ఆర్జిత అభిషేకాలు, సామూహిక అభిషేకాలు పూర్తిగా నిలుపుదల చేశామని దేవస్థానం ఈవో లవన్న విలేకరులకు తెలిపారు. అమ్మవారి అంతరాలయంలో కుంకుమార్చన కూడా నిలుపుదల చేసి అమ్మవారి ఆలయ ఆశీర్వచన మండపంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. స్వామి, అమ్మవార్ల కల్యాణాలు యథావిధిగా జరిపిస్తామని, భక్తులు గమనించి, దేవస్థాన సిబ్బందికి సహకరించాలని కోరారు.

అక్రమాలకు చెక్ పడేదెన్నడు?

- పంచలింగాల ఆర్‌టీఏ చెక్‌పోస్టులో దందాలు!
- అడిగినంత ఇవ్వకపోతే ముందుకు కదలని వాహనాలు
- చెక్‌పోస్టులో వసూళ్లకు పది మంది ప్రైవేటు వ్యక్తులు
- ఏసీబీ తనిఖీలు జరిగినా ఆగని వసూళ్ల పర్వం
- చెక్‌పోస్టుపై కొరవడిన జిల్లా అధికారుల పర్యవేక్షణ



అంతర్‌రాష్ట్ర రవాణా చెక్‌పోస్టు కార్యాలయం

కర్నూలు: జిల్లా సరిహద్దులో పంచలింగాల వద్ద ఉన్న రవాణా శాఖ (ఆర్‌టీఏ) అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు అక్రమ వసూళ్లకు అడ్డాగా మారింది. అక్కడి అధికారులు తమ చేతికి మట్టి అంటకుండా పుల్లూరు గ్రామానికి చెందిన ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని వసూళ్లకు తెగబడుతున్నారు. చెక్‌పోస్టుపై ఏసీబీ దాడులు జరిగినా కొన్ని నెలలు కూడా గడవకముందే మళ్లీ వసూళ్ల పర్వం ఊపందుకుంది. రాష్ట్రం విడిపోయిన తర్వాత కర్నూలు శివారుతో పాటు సున్నిపెంట వద్ద రవాణా శాఖ అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు ఏర్పాటు చేశారు. హైదరాబాదు-బెంగళూరు జాతీయ రహదారి (ఎన్‌హెచ్-44) అయినందున పంచలింగాల చెక్‌పోస్టు మీదుగా రోజుకు 50 వేలకు పైగా వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఇక్కడ అక్రమ వసూళ్ల పర్వం సాగుతోంది. పగటిపూట మోస్తరుగా సాగుతున్న అక్రమ దందాకు రాత్రి రెక్కలు వస్తున్నాయి. వాహన రికార్డులు సక్రమంగా లేవనో, లోడ్ ఎక్కువగా ఉందనో (ఓవర్ లోడ్), పర్మిట్ (అనుమతి) లేదనో... ఇలా ఏదో ఒక సాకు చూపి వాహనాలు నిలిపేస్తున్నారు. అక్కడ అడిగినంత ఇచ్చిన తర్వాత గానీ ముందుకు కదలనివ్వరు.

వాహనాన్ని బట్టి వసూళ్లు

నిబంధనల ప్రకారం పంచలింగాల చెక్‌పోస్టులో ఏఎంవీఐలు విధులు నిర్వహించాలి. అయితే ఆదాయం కోసం సీనియర్ ఎంవీఐలు ఇక్కడ తిష్ట వేశారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, 2 నుంచి రాత్రి 8 గంటల వరకు, రాత్రి 8 నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు ఒకరు చొప్పున అధికారులు మూడు షిఫ్టులలో విధులు నిర్వహిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాల నుంచి ట్యాక్స్ వసూలు చేయడం, ఓవర్ లోడ్, ప్రయాణికులతో వెళ్తుంటే కేసులు నమోదు చేయడం వీరి విధుల్లో భాగం. అయితే ఏదో ఒక సాకు చూపి ఒక్కొక్క వాహనదారుని నుంచి రూ.200 నుంచి రూ.500, భారీ వాహనాలైతే రూ.వెయ్యి దాకా వసూలు చేస్తున్నారు. షిఫ్ట్ విధులు పూర్తి కాగానే వసూలైన మొత్తం డబ్బును ప్రైవేటు వ్యక్తులే అధికారుల ఇళ్లకు చేరవేస్తుంటారు.

అక్కడ 'ప్రైవేటు' వ్యక్తులదే పెత్తనం

ఇక్కడ వసూళ్ల కోసం పది మంది ప్రైవేటు వ్యక్తులను నియమించుకున్నారు. వీరిలో పుల్లూరు గ్రామానికి చెందిన వ్యక్తులదే పెత్తనం. పుల్లూరు గ్రామానికి చెందిన మనోజ్‌తో పాటు అతని బంధువులు మరో నలుగురు వసూళ్ల పర్వానికి అధికారులు సహకరిస్తుంటారు. అలాగే వెంకట్రావు, వలి, సురేష్, వీరూ తదితర ప్రైవేటు వ్యక్తులు కూడా ఇక్కడ కర్రలు చేతపట్టుకుని రోడ్డుగూండా వెళ్లే వాహనాలు ఒక్కటి కూడా 'మిస్' కాకుండా నిలిపేసి నిరంతరాయంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇందుకోసం ప్రైవేటు వ్యక్తులకు ఒక్కొక్కరికి రోజుకు రూ.2 వేల నుంచి రూ.3 వేల చొప్పున ఇస్తూ నియమించుకున్నారు. చెక్‌పోస్టు ఏర్పాటైనప్పటినుంచి ఇక్కడ పుల్లూరు వాసులదే పెత్తనం. ఇక్కడ సంపాదించిన డబ్బుతో వారు ఎకరాల కొద్దీ భూములు కొనుగోలు చేసినట్లు అక్కడ పనిచేసేవారే చర్చించుకుంటున్నారు. దీనిని బట్టి అక్కడ పనిచేసే అధికారులకు ఆదాయం ఏ మోతాదులో ఉంటుందో వేరే చెప్పనక్కర్లేదు. అక్రమ వసూళ్ల కారణంగా ప్రభుత్వ ఆదాయానికి రూ.10 లక్షల వరకు గండి పడుతోంది.

రెండు విడతలుగా ఏసీబీ దాడులు

ప్రభుత్వం ఎంతగా నియంత్రిస్తున్నప్పటికీ రవాణా శాఖలో వసూళ్ల పర్వం ఆగడం లేదు. నిబంధనలు ఉల్లంఘించి రోడ్లపై తిరిగే వాహనదారులపై చర్యలు తీసుకుని ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చాల్సిన అధికారులే స్వంత జేబులు నింపుకుంటున్నారు. గత ఐదేళ్ల కాలంలో రవాణా శాఖ అధికారులపై నమోదైన ఏసీబీ కేసులే ఇందుకు నిదర్శనం. ఈ చెక్‌పోస్టుపై రెండుసార్లు ఏసీబీ తనిఖీలు జరిగాయంటే అక్రమ వసూళ్లు ఏ స్థాయిలో జరుగుతున్నాయో ఊహించుకోవచ్చు. రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన టోల్‌ఫ్రీ నంబర్ 14400కు రవాణా శాఖ చెక్‌పోస్టులో అవినీతిపై జిల్లా నుంచి తరచూ ఫిర్యాదులు వెళ్తున్నాయి.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టులో హోంగార్డులను ఏర్పాటు చేశాం. అక్కడ సీసీ కెమెరాలు కూడా ఉన్నాయి. ప్రైవేట్ సిబ్బంది పనిచేస్తున్నట్లు వస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదు. అక్రమాలు జరుగుతున్నట్లు ఇంత వరకు మాకు ఎవరూ ఫిర్యాదు చేయలేదు. తగిన ఆధారాలతో ఫిర్యాదు చేస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, డీటీసీ

ఇక్కడి విధులకు హోంగార్డుల మధ్య పోటీ

రవాణా శాఖలో మొత్తం 11 మంది హోంగార్డులు విధులు నిర్వహిస్తున్నారు. వీరు నెల రోజులు ఆఫీసు విధులు, మరుసటి నెల చెక్‌పోస్టు విధులు నిర్వహిస్తుంటారు. అయితే ఇక్కడ వచ్చే ఆదాయం కోసం చెక్‌పోస్టు విధులకు కొంతమంది హోంగార్డులు పోటీ పడుతున్నారు. రెండేళ్ల నుంచి ముగ్గురు మాత్రమే విధులు నిర్వహిస్తుండగా వారిపై ఫిర్యాదులు రావడంతో నెల రోజుల క్రితమే వారి స్థానంలో కొత్తవారిని అక్కడ నియమించారు. ఇక్కడ అధికారుల వసూళ్లకు సహకరిస్తున్నందుకు హోంగార్డులకు కూడా ఒక్కొక్కరికి రూ.3 వేలు అనధికార సొమ్ము నుంచి అధికారులు ఇస్తున్నట్లు సమాచారం. ఇక్కడ షిఫ్ట్‌కు ఒక ఇన్‌స్పెక్టర్, ఒక హోంగార్డు చొప్పున మూడు షిఫ్టుల్లో ముగ్గురేసి చొప్పున అధికారులు, హోంగార్డులు విధులు నిర్వహిస్తుంటారు. గత ఏడాదిలో జరిగిన బదిలీల్లో చెక్‌పోస్టు విధులు నిర్వహించడానికి అధికారులు భారీగా పోటీ పడ్డారు. దాదాపు 40 మందికి పైగా సీనియర్ ఎంవీఐలు ఇక్కడ పని చేయడానికి ఆసక్తి చూపుతూ తమ దరఖాస్తుల్లో ఆప్షన్లు ఇచ్చుకున్నారంటే ఇక్కడ ఏ స్థాయిలో ఆదాయం ఉందో ఊహించుకోవచ్చు.

రెండో శనివారం పాఠశాలలకు పనిదినం

కర్నూలు కల్చరల్: జిల్లాలోని అన్ని పాఠశాలలు రెండో శనివారం పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ వి.రంగారెడ్డి తెలిపారు. సంక్రాంతి సెలవులు ఒక రోజు పెంచినప్పుడు ఆ రోజును ఏదైనా ఒకరోజు పనిచేయాలని ప్రభుత్వం తెలిపిన ప్రకారం రెండవ శనివారమైన మార్చి 11వ తేదీన వర్కింగ్ డేగా నిర్ణయించినట్లు తెలిపారు. ఎంఈఓలు, డిప్యూటీ ఈఓలు ఈ సమాచారం ప్రతి ఉపాధ్యాయుడికి తెలపాలన్నారు. 11వ తేదీన ఎలాంటి లోకల్ హాలిడే, ఇతర సెలవులు పాఠశాలకు ఇవ్వరాదని పేర్కొన్నారు.

రేపటి నుంచి వైన్‌షాపులు బంద్

కర్నూలు (టౌన్): శాసన మండలి ఎన్నికలను పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా వైన్‌షాపులు, బార్లు, కల్లు దుకాణాలు మూసివేయాలని జిల్లా కలెక్టర్ పి.కోటేశ్వరరావు గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 11 వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి 13వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు, అలాగే 16వ తేదీ కౌంటింగ్ నిర్వహిస్తున్నందున వైన్‌షాపులు, బార్లు మూసివేయాలని కలెక్టర్ పేర్కొన్నారు.

వీబీఆర్‌లో చేప పిల్లల విడుదల



చేప పిల్లలను వదులుతున్న దృశ్యం

వెలుగోడు: వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో గురువారం 11 లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. నంద్యాల జిల్లా ఎఫ్‌డీవో భరత్‌లాల్ నాయక్, ఏడీఏ సంధ్యారాణి, సర్పంచ్ వేల్పుల జయపాల్ చేతుల మీదుగా బొచ్చ, ఎర్రమేరును చేప పిల్లలను నీటిలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీవో మాట్లాడుతూ..మత్స్య సంపదను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి ఇంటర్ పరీక్షలు

- పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి
- కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) రవి నాయక్



మాట్లాడుతున్న ఆర్జేడీ రవి నాయక్

కర్నూలు కల్చరల్: ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు మార్చి 15వ తేదీ నుంచి ప్రారంభం కానున్నట్లు కడప రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) రవి నాయక్ తెలిపారు. గురువారం ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల నిర్వహణపై టౌన్ మోడల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, కష్టోడియన్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా పరీక్షలను నిర్వహించాలన్నారు. ఆర్ఐఓ గురువయ్య శెట్టి మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 124 పరీక్ష కేంద్రాలున్నాయన్నారు. కర్నూలు జిల్లాలో 73, నంద్యాల జిల్లాలో 51 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఫస్ట్ ఇయర్ విద్యార్థులు 35,788 మంది, సెకండ్ ఇయర్ విద్యార్థులు 40,849 మంది పరీక్షలకు హాజరవుతున్నారన్నారు. పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగుతాయన్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలు, ఫర్నీచర్, తాగునీటి వసతులు కల్పించామన్నారు. కర్నూలు జిల్లా డీవీఈఓ జమీర్‌బాషా, నంద్యాల జిల్లా డీవీఈఓ సునీత మాట్లాడారు. సమావేశంలో డీఈసీ, హైపవర్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దిగువ అహోబిలంలో బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత గరుడవాహనంపై విహరిస్తున్న ప్రహ్లాదవరదుడు



ఎమ్మెల్సీ ఎన్నికలపై జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి హాజరైన మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, గుమ్మనూరు జయరాం, జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నియోజకవర్గ ఇన్‌చార్జులు

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ప్రతిపక్షాల ప్రలోభాలను తిప్పికొట్టాలి
- ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించాలి
- రాష్ట్ర మంత్రులు బుగ్గన, గుమ్మనూరు

కర్నూలు(రాజ్‌విహార్): శాసన మండలి ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, కర్నూలు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం అన్నారు. మండలి ఎన్నికల నేపథ్యంలో గురువారం స్థానిక పార్టీ జిల్లా కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి బుగ్గన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలో పూర్తి మెజారిటీ ఉందని, ఒక్క ఓటు కూడా తప్పిపోకుండా చూడాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలపై ఉందన్నారు. వంద ఓట్లు లేకపోయినా స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ తన మద్దతుదారులను ఇండిపెండెంట్లుగా బరిలోకి దించిందన్నారు. ప్రతి పక్షాల ప్రలోభాలను తిప్పి కొట్టేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే అభ్యర్థులను గెలిపిస్తాయన్నారు. ఉద్యోగాల కల్పన, అభివృద్ధి గురించి ఓటర్లకు వివరించాలన్నారు. కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. స్థానిక సంస్థల నుంచి చట్టసభల వరకు బీసీలకు అత్యధిక శాతం సీట్లు ఇచ్చిన ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీ అన్నారు. అణగారిన వర్గాలకు సమాజంలో గౌరవం, గుర్తింపు కల్పించిన ఘనత సీఎం జగన్‌దే అన్నారు. స్థానిక సంస్థలతో పాటు పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించాలన్నారు. ఉమ్మడి జిల్లా పార్టీ రీజినల్ కో ఆర్డినేటర్ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో గెలుపు కోసం మరింతగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ప్రజాప్రతినిధి తమ పరిధిలోని ఓటర్లను చైతన్యపరచి, పార్టీ అభ్యర్థులకు ఓటు వేయించాలే చూడాలన్నారు. పార్టీ నంద్యాల, కర్నూలు జిల్లాల అధ్యక్షులు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, బీవై రామయ్య మాట్లాడుతూ శాసన మండలి ఎన్నికలు పార్టీకి ఎంతో కీలకమని, దీని ప్రభావం రాబోవు ఎన్నికలపై ఉంటుందని చెప్పారు. సమష్టిగా శ్రమించి భారీ విజయాన్ని జిల్లా తరఫున సీఎంకు కానుకగా ఇద్దామన్నారు. అనంతరం మండలి అభ్యర్థులు డాక్టర్ ఎ. మధుసూదన్ (స్థానిక సంస్థలు), వెన్నపూస రవీంద్రారెడ్డి (పట్టభద్రులు) మాట్లాడుతూ సీఎం జగన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తామని, ఈ ఎన్నికల్లో తమకు మొదటి ప్రాధాన్యత ఓట్లు వేయించి గెలిపించాలని కోరారు. సమావేశంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీలు గంగుల ప్రభాకర్‌రెడ్డి, సి. ఇసాక్ బాషా, ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, శిల్పా చక్రపాణిరెడ్డి, కాటసాని రామిరెడ్డి, ఎర్రకోట చెన్నకేశవరెడ్డి, హఫీజ్‌ఖాన్, శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి, గంగుల బిజేంద్రారెడ్డి, డాక్టర్ సుధాకర్, కంగాటి శ్రీదేవి, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి, పార్టీ నగర అధ్యక్షురాలు సత్యనారాయణమ్మ, నియోజకవర్గాల పరిశీలకులు పాల్గొన్నారు.

పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి

- నోడల్ అధికారులను ఆదేశించిన కలెక్టర్ పి.కోటేశ్వరరావు



మాట్లాడుతున్న కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని నోడల్ అధికారులను కలెక్టర్ కోటేశ్వరరావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణపై జేసీ ఎస్. రామసుందర్‌రెడ్డితో కలసి సమీక్షించారు. బందోబస్తు, మ్యాన్‌పవర్, మెటీరియల్ మేనేజ్‌మెంట్, వెబ్‌కాస్టింగ్ తదితర అంశాలపై ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. బందోబస్తుకు సంబంధించి ప్రతి పోలింగ్ కేంద్రంలోని క్యూలైన్‌ను నియంత్రించడానికి ఇద్దరు పోలీసులతోపాటు లోకేషన్ల వారీగా నలుగురు పోలీసులు అందుబాటులో ఉంటారని, పోలింగ్ కేంద్రం ప్రాంగణంలో ఎస్ఐ స్థాయిలో మొబైల్ పార్టీ కూడా ఉంటుందని డీఎస్పీ వెంకట్రామి వివరించారు. ఎక్కడైనా అనుకోకుండా గొడవలు జరిగితే వెంటనే స్పందించడానికి 27 మంది సీఐలతో స్ట్రైకింగ్ ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి మాట్లాడుతూ..101 పీఓలు అవసరం కాగా 137 మంది, 101 ఏపీఓలు అవసరం కాగా 139 మంది, 192 మంది ఓపీఓలకుగాను 269 మందిని నియమించి, శిక్షణ ఇచ్చినట్లు వివరించారు. డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీధర్ మాట్లాడుతూ పోలింగ్ మెటీరియల్‌ను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఈనెల 10వ తేదీ ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బ్యాలెట్ పేపర్ డిస్ట్రిబ్యూషన్ ఉంటుందని, ఇందు కోసం ఏర్పాట్లు చేశామని డీపీఓ నాగరాజు నాయుడు వివరించారు. బ్యాలెట్ బాక్సులను పోలింగ్ కేంద్రాలకు తరలించే సమయంలో ప్రొటోకాల్‌ను పాటించాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డికి కలెక్టర్ సూచించారు. పోలింగ్ సిబ్బంది, బాక్సులు, బ్యాలెట్ పేపర్లను తరలించేందుకు కావాల్సిన వాహనాలను సిద్ధం చేశామని డీటీసీ శ్రీధర్ వివరించారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి వెబ్‌కాస్టింగ్ లైవ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్‌డీసీ రమ వివరించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్‌కాస్టింగ్ ఉంటుందని, 26 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వీడియోగ్రఫీ తీయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని సాంఘిక సంక్షేమ శాఖ డీడీ ప్రతాప్ సూర్య నారాయణరెడ్డి వివరించారు.

ఓటింగ్‌పై అవగాహన

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయడంపై అవగాహన పెంచుకోవాలని ఓటర్లకు కలెక్టర్ పి.కోటేశ్వరరావు గురువారం ఓ ప్రకటనలో సూచించారు. బ్యాలెట్ పేపర్‌లో అభ్యర్థి పేరు మాత్రమే ఉంటుందని, ఎటువంటి గుర్తులు ఉండబోవని పేర్కొన్నారు. అభ్యర్థికి ఎదురుగా అంకెలను మాత్రమే వేయాలని సూచించారు. ఒకటో ప్రాధాన్యత ఇచ్చిన తరువాత మిగిలిన అభ్యర్థులకు ఓటు వేయడం, వెయ్యకపోవడం ఎవరి ఇష్టం వారిదని పేర్కొన్నారు.

పటిష్ట ఏర్పాట్లు చేయండి

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. గురువారం విజయవాడ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎమ్మెల్సీ ఎన్నికలపై కలెక్టర్లతో సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..పోలింగ్‌కు 48 గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్లు ఆధార్, సర్వీసు, డిగ్రీ లేదా డిప్లమో సర్టిఫికెట్లు, ఓటరు తదితర కార్డుల్లో దేనినైనా పోలింగ్ కేంద్రంలో చూపించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని గురువారంతో ముగించాలన్నారు. కర్నూలు జిల్లాలో గ్రాడ్యుయేట్లు, టీచర్లు, స్థానికసంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకోసం మొత్తం 107 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కోటేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, డీఆర్వో ఎస్వీనాగేశ్వరరావు, ఎన్నికల సూపరింటెండెంట్ మురళీ పాల్గొన్నారు.

హజ్ యాత్ర దరఖాస్తుకు నేడే ఆఖరు

కర్నూలు(రాజ్‌విహార్): హజ్‌కు వెళ్లే యాత్రికులు దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారంతో గడువు ముగియనుందని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హఫీజ్ మంజూర్ అహ్మద్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2023 హజ్ మార్గదర్శకాల మేరకు దరఖాస్తు చేసేకునేందుకు ఒక్కరోజు మాత్రమే మిగిలి ఉందన్నారు. దరఖాస్తుకు పాస్‌పోర్టు మొదటి, చివరి పేజీల కలర్ జిరాక్స్ కాపీని జత చేయాలని, పాస్‌పోర్టు గడువు 2024 ఫిబ్రవరి 3 వరకు ఉండాలని పేర్కొన్నారు. జాతీయ బ్యాంక్ ఖాతా పాస్ బుక్ కలర్ జిరాక్స్/క్యాన్సిల్డ్ చెక్కు కాపీ, అభ్యర్థులు మెడికల్ స్క్రీనింగ్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, కోవిడ్-19 వ్యాక్సిన్స్ వేసుకున్న సర్టిఫికెట్లు జత చేయాలని చెప్పారు. తెల్ల బ్యాగ్రౌండ్‌తో రెండు కలర్ ఫోటోలు సమర్పించాలని, దరఖాస్తుల ప్రక్రియ పూర్తయ్యాక లాటరీ ద్వారా ఎంపిక ఉంటుందని వెల్లడించారు. ఆసక్తి ఉన్న వారు శుక్రవారం (మార్చి 10)లోపు కర్నూలు బుధవారపేటలో రాయలసీమ హజ్ సొసైటీ కార్యాలయంలో, పెద్ద మార్కెట్ సమీపంలోని జిల్లా హజ్ సొసైటీ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలు ఉచితంగా పొందవచ్చని సూచించారు.

అన్నదాతకు అధిక సం'పత్తి'

అన్నదాతకు అధిక ఆదాయం వచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పత్తిని సంప్రదాయ పద్ధతిలో కాకుండా అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసే విధంగా హై డెన్సిటీ ప్లాంటేషన్ ప్రోగ్రామ్ (హెచ్‌డీపీపీ)ను అమలు చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించింది. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ప్రతి మండలంలో కనీసం 25 ఎకరాల్లో హెచ్‌డీపీపీ కింద పత్తి సాగు చేసేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.



అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి

- పత్తిలో అధిక సాంద్రత సాగు లాభదాయకం
- ఎకరాకు 4 క్వింటాళ్ల వరకు దిగుబడి పెరిగే అవకాశం
- తగ్గనున్న గులాబీ రంగు పురుగుల బెడద
- నవంబరులో రెండో పంటగా శనగ సాగు చేయవచ్చు
- వచ్చే ఖరీఫ్ నుంచి హెచ్‌డీపీపీ అమలు
- ప్రతి మండలంలో ప్రదర్శన క్షేత్రాలు



సంప్రదాయ పద్ధతిలో మొక్కలు తక్కువగా ఉన్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో ఖరీఫ్ సాధారణ సాగు 4.10 లక్షల హెక్టార్లు కాగా ఈ ఏడాది 2.48 లక్షల హెక్టార్లలో రైతులు పత్తి సాగు చేశారు. నల్లరేగడి భూములైన వీటిలో రెండు పంటలు తీసే అవకాశం ఉన్నప్పటికీ రైతులు కేవలం పత్తికి మాత్రమే పరిమితమవుతున్నారు. ఆదోని డివిజన్‌లో పంట పూర్తయిన తర్వాత చిన్న, సన్న, మధ్యకారు రైతులు వలస బాట పడుతున్నారు. వలసలను నివారిస్తూ.. రైతులకు లాభాలు వచ్చే విధంగా వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి నల్లరేగడి నేలల్లో వినూత్న పద్ధతిలో మొదటి పంట పత్తి, తర్వాత పప్పు శనగ సాగు చేసే విధంగా వ్యవసాయ శాఖ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. పత్తిని సంప్రదాయ పద్ధతిలో కాకుండా అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసే విధంగా రైతుకు అవగాహన కల్పించేందుకు కసరత్తు చేస్తున్నారు.

అధిక దిగుబడి

సంప్రదాయ పద్ధతిలో సాలుకు, సాలుకు మధ్య 90 నుంచి 120 సెం.మీ, మొక్కకు, మొక్కకు మధ్య 45 నుంచి 90 సెం.మీ ఉంటుంది. ఈ విధానంలో ఎకరాకు 15 వేల నుంచి 25 వేల మొక్కలు మాత్రమే వస్తున్నాయి. హెచ్‌డీపీపీ కింద సాలుకు, సాలుకు మధ్య దూరం 30 నుంచి 90 సెం.మీ, మొక్కకు, మొక్కకు మధ్య దూరం 10 నుంచి 15 సెం.మీ ఉటుంది. ఎకరా భూమిలో లక్ష నుంచి 2.50 లక్షల వరకు మొక్కలు వస్తాయి. మామూలు పద్ధతిలో ఎకరాకు 1-2 ప్యాకెట్ల బీటీ పత్తి విత్తనాలు మాత్రమే వేస్తారు. కొత్తపద్ధతిలో ఎకరాకు 5-6 ప్యాకెట్ల విత్తనాలు వేయాల్సి వస్తుంది. ఫలితంగా రూ.3,200 వరకు ఖర్చు ఎక్కువగా వస్తుంది. కొత్త పద్ధతిలో ఒక బస్తా డీఏపీ అధికంగా వేయాలి. రెండుసార్లు గ్రోత్ రెగ్యులేటర్స్ కింద మెపిక్యాట్ క్లోరిన్ 50-60 రోజులు, 90 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాల్సి ఉంది. అధిక సాంద్రత పద్ధతిలో ఎకరాకు రూ.6,000 వరకు పెట్టుబడి వ్యయం పెరుగుతున్నా.. దిగుబడి సంప్రదాయ పద్ధతిలో కంటే ఎకరాకు 4 క్వింటాళ్లు ఎక్కువ పొందే అవకాశం ఉంది. మార్కెట్‌లో పత్తి క్వింటా రూ.7వేల వరకు ధర పలుకుతోంది. ఖర్చును మినహాయిస్తే రూ.22 వేలు నికరాదాయం పొందే అవకాశం ఉంది.

నవంబరు నెలలో రెండో పంట

ఇంతవరకు పత్తిని దీర్ఘకాలం సాగు చేస్తున్నారు. జనవరి, ఫిబ్రవరి వరకు ఉంచుతున్నారు. మంచి సారవంతమైన నల్ల రేగడి నేలల్లో రైతులు కేవలం ఒక్క పంటకే పరిమితం అవుతున్నారు. అధిక సాంద్రత పద్ధతిలో అక్టోబరు నెలకు పంట పూర్తి అవుతుంది. నవంబరులో రబీ కింద మళ్లీ శనగ సాగు చేపట్టవచ్చు. నూతన పద్ధతితో అధిక ఆదాయం, రెండో పంటగా శనగ సాగు చేయడం వల్ల ఎకరాకు రూ.35 వేలు ఆదాయం పొందవచ్చని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

మొక్కలు ఎత్తు పెరగకుండా..

అధిక సాంద్రత పద్ధతిలో మొక్క ఎత్తు పెరగకుండా చేసి.. శాఖలు ఎక్కువగా వచ్చే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎత్తు పెరగడాన్ని నియంత్రించేందుకు మెపి క్యాట్ క్లోరిన్ మందు 1 ఎం.ఎల్. లీటరు నీటికి కలిపి 50-60 రోజుల సమయంలో ఒకసారి, 90 రోజుల సమయంలో రెండవ సారి పిచికారీ చేయాల్సి ఉంది. ఫలితంగా పైరు మొత్తం ఒకే ఎత్తులో ఉంటుంది. శాఖలు పెరుగడం వల్ల కాయలు ఎక్కువగా వచ్చి దిగుబడి పెరుగుతుంది. సంప్రదాయ పద్ధతిలో 3-4 సార్లు పత్తి తీస్తారు. నూతన పద్ధతిలో రెండుసార్లు మాత్రమే పత్తి తీస్తారు. పంట కాలం తగ్గుతుండటం వల్ల చీడపీడల బెడద తగ్గుతుంది. ముఖ్యంగా గులాబీ రంగు పురుగు బెడదకు ఈ పద్ధతిలో చెక్ పెట్టవచ్చు.

రైతులకు అవగాహన కల్పిస్తాం



వచ్చే ఖరీఫ్ నుంచి హై డెన్సిటీ ప్లాంటేషన్ ప్రోగ్రామ్ కింద పత్తి సాగును ప్రోత్సహిస్తున్నాం. ప్రతి మండలంలో కనీసం 10 హెక్టార్లలో పత్తి ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేయనున్నాం. మామూలు పద్ధతిలో పత్తి పంట కాలం 160-170 రోజులు ఉంటుంది. నూతన పద్ధతిలో 130-140 రోజులకు దిగుబడి వస్తుంది. ఈ పద్ధతిపై రైతులకు అవగాహన కల్పిస్తాం. ఇందుకోసం పత్తి ప్రదర్శన క్షేత్రాలు ఏర్పాటు చేస్తాం.

– పీఎల్ వరలక్ష్మి, డీఏవో, కర్నూలు

క్లుప్తంగా

జాతీయ పోటీలకు అంపైర్‌గా ఎంపిక



ఓబుల్‌రెడ్డి

ఆళ్లగడ్డ: చాగలమర్రికి చెందిన ఓబుల్‌రెడ్డి జాతీయ బ్యాడ్మింటన్ పోటీలకు అంపైర్‌గా ఎంపికయ్యారు. ప్రస్తుతం ఈయన రాజుపాలెం మండలం టంగుటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బీఏఐ ఆధ్వర్యంలో ఇటీవల రాజస్థాన్ ఎంపిక పోటీలు నిర్వహించగా వివిధ ప్రాంతాల నుంచి 120 మంది హాజరు కాగా ఇందులో 27 మంది ఎంపికయ్యారు. వారిలో ఓబుల్‌రెడ్డి ఉండగా, గురువారం బ్యాండ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బీఏఐ) నుంచి ఆయనకు ఉత్తర్వులు అందాయి.

మెరుగైన సేవలందించాలి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు(ఎంఎల్‌హెచ్‌పీ)లు శిక్షణ కార్యక్రమంలో నైపుణ్యం పెంచుకుని గ్రామస్థాయిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య చెప్పారు. ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో నిర్వహిస్తున్న సామాజిక ఆరోగ్య అధికారుల శిక్షణ కార్యక్రమంలో గురువారం ఆయన ప్రసంగించారు. అత్యవసర కేసులు వచ్చినప్పుడు తగిన ప్రథమ చికిత్స అందించిన తర్వాత సంబంధిత ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనం ద్వారా రెఫర్ చేయాలన్నారు. వేసవిలో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉన్నందున నివారణ చర్యల గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎంయు డాక్టర్ ఉమ, డాక్టర్ చంద్రకాంత్ యాదవ్, డాక్టర్ రజని, డాక్టర్ సుష్మిత, డీపీవో విజయరాజు పాల్గొన్నారు.

మార్కెట్‌కు పోటెత్తుతున్న వేరుశనగ

కర్నూలు(అగ్రికల్చర్): కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు వేరుశనగ పోటెత్తుతోంది. 2022-23 రబీలో సాధారణ సాగు 14,148 హెక్టార్లు ఉండగా 15,479 హెక్టార్లలో సాగైంది. రబీలో పండించిన వేరుశనగ కర్నూలు, ఎమ్మిగనూరు, ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులకు వస్తోంది. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు రోజు 2,000 క్వింటాళ్ల నుంచి 2,600 క్వింటాళ్ల వరకు వస్తోంది. రబీలో పండించిన వేరుశనగలో నాణ్యతతో పాటు నూనె శాతం కూడా ఎక్కువగా ఉంటోంది. కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం క్వింటా కనిష్ట ధర రూ.3,737, గరిష్ట ధర రూ.7,130 ఉండగా.. మోడల్ ధర రూ.6166గా నమోదైంది.

ఉపాధి కూలీలను పెంచండి

- డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి



కొరటమద్ది గ్రామంలో జరుగుతున్న పనులను పరిశీలిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

గడివేముల: ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్యను పెంచాలని నంద్యాల జిల్లా డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ రామచంద్రారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. మండల పరిధిలోని కొరటమద్ది గ్రామంలో జరుగుతున్న పనులను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులకు అవసరమైన పనులను గుర్తించాలన్నారు. అమృత్ సరోవర్ ప్రాజెక్టు కింద ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటలలో పనులు చేయడం జరుగుతుందన్నారు. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనులను కల్పించాలన్నారు. ఆయన వెంట ఏపీఓ వెంకటరమణ, ఈసీ సునీల్ గవాస్కర్, టీఏలు ప్రసాద్, శంకరయ్య, తదితరులు ఉన్నారు.

వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించండి

- బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దియోధర్



మాట్లాడుతున్న బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ దియోధర్

కర్నూలు కల్చరల్: కుటుంబ పాలన, వారసత్వ రాజకీయాలను వ్యతిరేకించాలని బీజేపీ జాతీయ కార్యదర్శి, బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జ్ సునీల్ దియోధర్ పిలుపునిచ్చారు. గురువారం కర్నూలులో ఆయన పశ్చిమ రాయలసీమ బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎన్.రాఘవేంద్ర తరపున ఎన్నికల ప్రచారం చేశారు. నరేంద్ర మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం భారత్‌ను విశ్వశక్తిగా నిలుపుతోందన్నారు. బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యదర్శి పార్థసారథి, జిల్లా అధ్యక్షులు రామస్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాఘవేంద్ర మాట్లాడారు. కార్యక్రమంలో మాంటిస్సోరి పాఠశాల అధినేత రాజశేఖర్, ప్రధానోపాధ్యాయురాలు రమాజ్యోతి, బీజేపీ నాయకులు గీతా మాధురి తదితరులు పాల్గొన్నారు.

వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందాం

- ప్రభుత్వ కార్యాలయాల్లో జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కర్నూలు(అర్బన్): ఈ నెల 13వ తేదీన జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించుకుందామని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కోరారు. గురువారం సాయంత్రం ఆయన ఆత్మకూరు, కొత్తపల్లి జెడ్పీటీసీలు శివశంకర్ రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎన్నికల కోఆర్డినేటర్ కుమారస్వామిరెడ్డితో కలిసి జెడ్పీ కార్యాలయంతో పాటు ప్రాంగణంలో ఉన్న పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్, క్వాలిటీ కంట్రోల్, డీఎల్‌పీఓ, డీఎల్‌డీఓ, డీపీఆర్‌సీ కార్యాలయాల్లోని ఉద్యోగులను కలిసి మొదటి ప్రాధాన్యత ఓటును వెన్నపూస రవీంద్రారెడ్డికి వేయాలని కోరారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, నిర్ణీత సమయంలోగా పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు.

ఆర్‌డీఓ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలు ...

ఉమ్మడి కర్నూలు జిల్లాలోని కర్నూలు, ఆదోని, పత్తికొండ, నంద్యాల, ఆత్మకూరు, డోన్ ఆర్‌డీఓ కార్యాలయాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చెప్పారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ మధుసూదన్‌కు ఓట్లు వేసి గెలిపించాలని ఆయన ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నమోదైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలకు లేఖలు రాశారు. అలాగే పట్టభద్రులు, ఉపాధ్యాయ అభ్యర్థులుగా బరిలో ఉన్న పార్టీ అభ్యర్థులు వెన్నపూస రవీంద్రారెడ్డి, రామచంద్రారెడ్డిని గెలిపించాలన్నారు.

విజిలెన్స్ ప్రాంతీయ అధికారికి ఐపీఎస్ హోదా

కర్నూలు (టౌన్): విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారిగా పనిచేస్తున్న కె. తిరుమలేశ్వరరెడ్డికి ఐపీఎస్‌గా పదోన్నతి పొందారు. ఆయన చేసిన సేవలను గుర్తించి రాష్ట్ర సర్వీస్ నుంచి కేంద్రం ఐపీఎస్‌గా పదోన్నతి కల్పించింది. ఇండియన్ పోలీసు సర్వీస్ ప్రమోషన్ ద్వారా నియమకాన్ని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఎంపిక చేసి 10 మంది జాబితాను ఆమోదించింది. ఇందులో కర్నూలు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాంతీయ అధికారి తిరుమలేశ్వరరెడ్డి ఉన్నారు. గురువారం కేంద్రం ఈ జాబితాను విడుదల చేసింది. త్వరలో జీవో వెలువడనుందని జిల్లా పోలీసు కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.

కర్ణాటక మద్యం పట్టివేత



నిందితుల అరెస్ట్ చూపుతున్న సెబ్ సీఐ జయరాం నాయుడు

ఎమ్మిగనూరురూరల్: నందవరం మండలం పులిచింత సమీపంలో అక్రమంగా రవాణా చేస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం స్థానిక సెబ్ కార్యాలయం ఆవరణలో పట్టుబడిన మద్యం, నిందితుల వివరాలను సెబ్ సీఐ జయరాంనాయుడు మీడియాకు వివరించారు. పులిచింత దగ్గర వాహనాలు తనిఖీ చేస్తుండా రాయచూర్ జిల్లా ఇడపనూరుకు చెందిన లింగన్న, తాయన్నలు రెండు మోటార్ బైక్‌లపై 480 కర్ణాటక టెట్రా ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. నందవరం మండలం బాపురం గ్రామానికి నల్లబోతుల హనుమంతుకు ఇచ్చేందుకు తీసువస్తున్నట్లు విచారణలో తేలిందన్నారు. మద్యం, 2 బైక్‌లు స్వాధీనం చేసుకొని పట్టుబడిన కర్ణాటక వాసులను కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించినట్లు చెప్పారు. పట్టుబడిన మద్యం విలువ రూ. 22,500 ఉంటుందన్నారు. సమావేశంలో సెబ్ ఎస్‌ఐ సోమశేఖర్‌రావు, హెడ్‌కానిస్టేబుళ్లు రబ్బానీ, గోపాల్, లింగప్రసాద్, చంద్రమౌళి, మురళీ, కానిస్టేబుళ్లు రామచంద్రుడు, నరసింహ రెడ్డి, రాధమ్మ, చంద్రన్న పాల్గొన్నారు.

శ్రీశైలంలో దర్శన వేళలు మార్పు

- 19 నుంచి ఉగాది ఉత్సవాలు ప్రారంభం
- ఉత్సవాలకు ముందు భారీగా చేరుకోనున్న కన్నడిగులు
- 18వ తేదీ వరకు మల్లన్న స్పర్శదర్శనానికి అవకాశం
- 19 నుంచి 23వ తేదీ వరకు అలంకార దర్శనం



శ్రీశైలాలయం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో నిర్వహించే ఉగాది మహోత్సవాల నేపథ్యంలో మల్లన్న దర్శన వేళలు మార్పు చేశారు. ఈ నెల 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు ఉగాది మహోత్సవాలు జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు కర్ణాటక, మహారాష్ట్రాలకు చెందిన వేలాది మంది భక్తులు శ్రీశైలానికి తరలిరానున్నారు. భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు దర్శనాల్లో దేవస్థానం పలు మార్పులు చేసింది. గురువారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు నిర్దిష్ట వేళల్లో నాలుగు విడతలుగా భక్తులకు స్వామివారి స్పర్శదర్శనానికి అవకాశం కల్పించింది. ఉదయం 6 నుంచి 7 గంటల వరకు, 11.30 నుంచి 1.30 గంటల వరకు, రాత్రి 7.30 నుంచి 9.30 గంటల వరకు, రాత్రి 10.30 నుంచి 11.30 గంటల వరకు స్పర్శదర్శనం ఉంటుంది. స్పర్శదర్శనం టిక్కెట్ రుసుం రూ.500గా నిర్ణయించారు. ఒక్కో విడతలో 1,500 టిక్కెట్లు మాత్రమే ఇచ్చేందుకు దేవస్థానం అధికారులు నిర్ణయించారు. ఉత్సవాల సమయంలో భక్తులందరికీ సౌకర్యవంతమైన దర్శనం కల్పించేందుకు ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు భక్తులందరికీ స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించనున్నారు. ఉత్సవాలకు 10 రోజులు ముందుగానే భక్తులు క్షేత్రానికి చేరుకునే అవకాశం ఉన్న నేపథ్యంలో భక్తులకు రోజుకు నాలుగు విడుతలుగా స్పర్శదర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ప్రతి రోజు గరిష్టంగా 15 వేల మందికి మాత్రమే స్వామివారని స్పర్శదర్శనం కల్పించే అవకాశం ఉంది. అయితే ఉత్సవ రోజుల్లో రోజుకు 60 వేల మందికి పైగా భక్తులు ఆలయాన్ని సందర్శించే అవకాశం ఉంటుంది. భక్తులందరికీ స్వామివారి దర్శనం కల్పించేందుకు ఉత్సవ రోజుల్లో ఈ నెల 19 నుంచి 23వ తేదీ వరకు స్వామివారి అలంకార దర్శనం మాత్రమే కల్పించనున్నారు.

అప్పుల బాధతాళలేక..



మృతి చెందిన వెంకటేష్

కృష్ణగిరి: వ్యవసాయం, కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చలేక జీవితం మీద విరక్తి చెంది ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కృష్ణగిరి ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. పెద్దొడ్డి గ్రామానికి చెందిన మొండెం వెంకటేష్(42) మూడు ఎకరాల పొలాన్ని సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. పొలంలో బోర్లు వేయించేందుకు, అలాగే కుటుంబపోషణ, మామిడి మొక్కలు సాగుకు దాదాపుగా రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. రెండేళ్లుగా సాగుచేసిన టమాట, ఇతర పంటలు సరైన దిగుబడి రాక అప్పులు కట్టలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 6న పొలంలోనే పురుగు మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. సమాచారం అందుకున్న కుటుంబీకులు కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా కోలుకోలేక గురువారం మృతి చెందాడు. మృతుని భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నాపరాయి బండ విరిగి పడి ..



మృతి చెందిన బాలుడు తిమ్మప్ప

ఆలూరు రూరల్: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడిపై నాపరాయి బండ విరిగి మీద పడటంతో తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ఆలూరు మండలం కరిడిగుడ్డం గ్రామానికి చెందిన పద్మావతి, వీరేష్ దంపతులకు ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు సంతానం. కుమారుడు తిమ్మప్ప (8) బుధవారం మధ్యాహ్నం ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఏడు అడుగుల పాత నాపరాయి బండల దగ్గర ఆడుకుంటున్నాడు. అప్పటికే పగుళ్లొచ్చిన బండను కదిలించడంతో విరిగి తలపై పడి తీవ్రగాయాలయ్యాయి. తల్లిదండ్రులు 108లో ఆలూరు ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు ప్రాథమిక చికిత్స చేసి కర్నూలు ఆస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాయక్ తెలిపారు.

14న నులిపురుగుల నివారణ మందుల పంపిణీ

కర్నూలు(హాస్పిటల్): చిన్నారులకు ఈ నెల 14వ తేదీన నులిపురుగుల నివారణ మందులు అందజేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి. కోటేశ్వరరావు ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని ప్రతి సంవత్సరం రెండు పర్యాయాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా మొదటి విడతగా ఈ నెల 14వ తేదీన అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు మాత్రలు అందజేయాలని సూచించారు. అపరిశుభ్రమైన ఆహారం, కలుషితమైన నీరు తీసుకోవడం వల్ల నులిపురుగుల ఏర్పడే అవకాశం ఉందని, మాత్రలను తీసుకోవడం వల్ల రక్తహీనత తగ్గి విద్యార్థులకు జ్ఞాపకశక్తి పెరిగి చదువుపై దృష్టి సారిస్తారన్నారు. 14న తేదీన మాత్రలు తీసుకోని వారికి 18వ తేదీన ఇవ్వాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు కూడా మాత్రలు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రాంజీనాయక్, డీఈవో రంగారెడ్డి, ఇన్‌చార్జ్ ఐసీడీఎస్ పీడీ ఉమామహేశ్వరి, ఏపీ రెసిడెన్సియల్ విద్యాసంస్థల సొసైటీ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల్లో..

కర్నూలు కల్చరల్: జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈనెల 14వ తేదీన జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఈఓ వి.రంగారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 19 సంవత్సరాల వయసులోపు విద్యార్థులకు వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఆ రోజు అన్ని విద్యా సంస్థల్లో మాత్రల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు.

ఆటో బోల్తా - ఒకరు మృతి



మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కోటేకల్ కొండ మలుపు వద్ద గురువారం రాత్రి ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో ఒకరు మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. వివరాలు.. మండల పరిధిలోని మసీదపురం గ్రామానికి చెందిన కురవ నరసింహుడు కుమారుడు కురవ వీరనాగుడు(23), భార్య సుశీల ఆదోని మండలం నాగలాపురం గ్రామంలో బంధువుల పెళ్లికి వెళ్లారు. సాయంత్రం బట్టలు తీసుకువస్తానని చెప్పి ఆటోలో మసీదపురం గ్రామానికి బావమరిది వీరేష్‌తో కలసి వచ్చారు. తిరిగి నాగలాపురం వెళ్తుండగా ఆరేకల్ వద్ద కొందరు చౌలకాయలు ఎమ్మిగనూరు మార్కెట్‌కు తరలించేందుకు బాడుగ మాట్లాడుకొని ఎక్కారు. అయితే కోటేకల్ కొండ మలుపు వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తాపడటంతో డ్రైవింగ్ చేస్తున్న వీరనాగుడు అక్కడికక్కడే మృతి చెందగా, వీరేష్‌కు గాయాలు అయ్యాయి. గాయపడ్డ వ్యక్తిని చికిత్స కోసం ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న బంధువులు అక్కడికి చేరుకొని బోరున విలపించారు. విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ సునీల్‌కుమార్ ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి వీరనాగుడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.